క్లుప్తంగా

నేడు బీటీ రోడ్లు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తోటపల్లి–గుణుపూర్ రోడ్డు నుంచి అడ్డంగూడ వరకు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన బీటీ రోడ్డుతో పాటు డెప్పిగూడ గ్రామానికి రూ. 1.35 కోట్ల నిధులతో నిర్మించిన బీటీ రోడ్డును ఆదివారం ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చేతుల మీదుగా రోడ్లు ప్రారంభం కానున్నాయని ఎంపీపీ కుంబురుక దీనమయ్య శనివారం తెలిపారు. ఎమ్మెల్యే చొరవతో రోడ్లు నిర్మాణం పూర్తి కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.

మినహాయింపు ఇవ్వాలి

గరుగుబిల్లి: పదో తరగతి మూల్యాంకనంలో 58 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులతో పాటు గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులైన ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్రాపు మహేష్ ఓ ప్రకటనలో శనివారం కోరారు. ఇదే విషయాన్ని పాఠశాల విద్య ప్రాంతీయ ఉపసంచాలకులకు కూడా తెలియజేయడం జరిగిందన్నారు. ఈ విషయంపై మానవతాదృక్పథంతో స్పందించాలన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ నేత కోమటిపల్లి చంద్రశేఖరరావు మాతృమూర్తి సత్తెమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శనివారం ఆ గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. పార్టీ పరంగా అండగా ఉంటామని, ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ శశికళ, మండల కన్వీనర్ మూడడ్ల గౌరీశంకరరావు, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, చినమేరంగి పీఏసీఎస్ అధ్యక్షుడు తాడేల మన్మథనాయుడు తదితరులు ఉన్నారు.

గిరిజనులు ఆర్థికంగా ఎదగాలి



కొండచీపుర్లు తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సత్యంనాయుడు

కొమరాడ: గిరిజన ప్రజలంతా ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ ఇన్‌చార్జ్ పీడీ సత్యంనాయుడు ఆకాంక్షించారు. మండలంలోని పెదశాఖ గ్రామంలో ఉన్న కొండచీపుర్ల తయారీ యూనిట్‌ను శనివారం సందర్శించిన ఆయన అక్కడ పనిచేస్తున్న గిరిజనులతో మాట్లాడి, వారి ఆర్థిక ప్రగతికి సలహాలు, సూచనలు చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులు తయారు చేసే ఉత్పత్తులను మైదాన ప్రాంతాల్లో గిరిజనులే అమ్మడం ద్వారా మంచి లాభాలు ఆర్జించవచ్చన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఆయన వెంట డీపీఎంలు ప్రవీణ్‌కుమార్, అప్పారావు తదితరులు ఉన్నారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాజాతా కళాకారులు

కురుపాం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వైడీవో నెట్‌వర్క్ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ(హ్యూమన్ ఇమ్యూనో వైరస్) నియంత్రణపై శనివారం అవగాహన కల్పించారు. వైరస్ సోకే పద్ధతులు, వైరస్ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాజాతా కార్యక్రమ కళాకారులు వివరించారు. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, తల్లిపాలు, రక్త మార్పిడి ద్వారా హెచ్ఐవీ సోకుతుందని, తద్వారా ఎయిడ్స్ వ్యాధి వస్తుందన్నారు. ఎయిడ్స్ వ్యాధికి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమన్నారు. కార్యక్రమంలో వైడీవో నెట్‌వర్క్ సంస్థ ప్రతినిధి గీతారాణి పాల్గొన్నారు.

బాబా మార్గం అనుసరణీయం



మెహర్‌బాబా తిరువీధిలో పాల్గొన్న భక్తులు

పాలకొండ రూరల్: అవతార్ మెహర్ బాబా చూపిన మార్గం అనుసరణీయమని భక్తులు నినదించారు. శనివారం బాబా 130వ జన్మదిన వేడుకలను స్థానిక మందిరంలో నిర్వహించారు. ఈ క్రమంలో ఆయన చిత్రపటంతో పట్టణంలో తిరువీధి చేపట్టారు. అనంతరం స్థానిక వంద పడక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ, అగ్నిమాపక కేంద్ర సమీపంలో సామూహిక అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. బాబా ప్రబోధించిన సూక్తులను భక్తులకు వివరించారు. సువర్ణ పతాకాన్ని బెహరా ప్రఫుల్లా దంపతులు, ప్రేమిక సహవాస్ ముఖ్య వక్త బి.అప్పలనాయుడు తదితరులు ఆవిష్కరించారు.

ప్రగతి మార్గాలు

గతంలో గుమ్మలక్ష్మీపురం మండలంలోని కొన్ని గిరిజన గ్రామాలకు చేరుకోవాలంటే కాలినడకే శరణ్యం. మరికొన్ని గ్రామాలకు అయితే కనీసం నడిచేందుకు కూడా కానరాని దారులు. టీడీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడంతో ఆ గ్రామాలు కనీస అభివృద్ధిని కూడా నోచుకోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయలు వెచ్చించి, మారుమూల గిరిజన గ్రామాలకు సైతం రోడ్లు నిర్మించింది. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో శరవేగంగా రోడ్ల నిర్మాణం జరగగా, మరికొన్ని గ్రామాల్లో చాలా చురుగ్గా పనులు కొనసాగుతున్నాయి. దీంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగనన్నకు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి రుణపడి ఉంటామంటున్నారు.

–గుమ్మలక్ష్మీపురం



మూలజమ్మ గ్రామానికి వేసిన బీటీ రోడ్డు

పూర్తయిన రోడ్లు వివరాలు..

- కీసర నుంచి కీసరగూడ గ్రామానికి రూ.1.30 కోట్లతో బీటీ రోడ్డ్
- కీసర రోడ్డు నుంచి డోలుకోన గ్రామానికి రూ.40 లక్షలతో సీసీ, బీటీ రోడ్లు
- టీజీ రోడ్డు(తోటపల్లి–గుణుపూర్) నుంచి డెప్పిగూడ గ్రామానికి రూ.1.35 కోట్లతో బీటీ రోడ్డు
- టీజీ రోడ్డు(తోటపల్లి–గుణుపూర్) నుంచి అడ్డంగూడ గ్రామానికి రూ.40 లక్షలతో రోడ్డు
- మురడ నుంచి రెబ్బగూడ గ్రామానికి రూ.1.15 కోట్లతో బీటీ రోడ్డు
- పి.ఆమిటి రోడ్డు నుంచి మూలజమ్మ గ్రామానికి రూ.1.30 కోట్లతో బీటీ రోడ్డు
- గుణద బీటీ రోడ్డు నుంచి కొండకూనేరు గ్రామానికి రూ.90 లక్షలతో బీటీ రోడ్డు



కీసరగూడ గ్రామానికి వెళ్లేందుకు వీలుగా నిర్మించిన రోడ్డు

నిర్మాణ దశలోని రోడ్లు వివరాలు..

- బీరుపాడు రోడ్డు నుంచి డొంగరికిక్కువ గ్రామానికి రూ.50 లక్షలతో బీటీ రోడ్డు
- బొద్దిడి నుంచి చినవంకధారకు రూ.90 లక్షలతో బీటీ రోడ్డు
- బొద్దిడి బీటీ రోడ్డు నుంచి రావివలసకు రూ.35 లక్షలతో బీటీ రోడ్డు
- లక్కగూడ రోడ్డు నుంచి సదనుగూడ గ్రామానికి రూ.75 లక్షలతో బీటీ రోడ్డు

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం..



గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. కొన్ని దశాబ్దాలుగా రోడ్లు లేక చాలా ఇబ్బందులు పడుతూ వచ్చాం. ఇప్పుడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మారుమూల గిరిజన ప్రాంతానికి కూడా రోడ్లు వేస్తుండడం చాలా ఆనందంగా ఉంది.

–పత్తిక ముసురు, సర్పంచ్, కీసరగూడ గ్రామం

త్వరితగతిన నిర్మాణ పనులు..



గ్రామాల్లో జరుగుతున్న రోడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. గడువులోగా పనులు పూర్తి చేయాలని ఇప్పటికే కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశాం. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.అప్పారావు, ఏఈఈ, భద్రగిరి గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ.



కొత్తగా నిర్మించిన దోలుకోన గ్రామ సీసీ రోడ్డు

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధాకుమారి

పాలకొండ: నగర పంచాయతీలో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తిచేయాలని చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి కోరారు. నగరపంచాయతీ కార్యాలయంలో శనివారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు సమస్యలను కౌన్సిలర్లు ప్రస్తావించారు. డంపింగ్ యార్డు సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. వేసవిలో నగర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. పలు సమావేశాలకు కౌన్సిలర్లుకు కనీసం సమాచారం కూడా అందించడం లేదని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకువచ్చారు. సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ సర్వేశ్వరరావు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రౌతు హనుమంతురావు, పల్లా ప్రతాప్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం విజయవంతం

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో శనివారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 75 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో నలుగురుకు కేటరాక్ట్ ఆపరేషన్, ఒకరికి రెటినా సమస్య ఉన్నట్టు గుర్తించారు. శిబిరంలో డిపో మేనేజర్ భాస్కర రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీ తదితరులు తమ వంతు సేవలందించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

పాలకొండ: వీరఘట్టం మండలం పనస నందివాడ గ్రామానికి చెందిన దమరసింగి గారయ్యకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును పాలకొండలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం లబ్ధిదారుకు అందించారు. గారయ్య అనారోగ్యం కారణంగా తలకు చికిత్స జరిగింది. వైద్య ఖర్చుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. ప్రభుత్వం రూ.1.20 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిరికాన గంగునాయుడు, కొరికాన సన్యాసినాయుడు, బొత్స ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న పాలవలస రాజశేఖరం

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. బిటివాడ గ్రామానికి చెందిన సొంట్యాన నరసింహారావు(35)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కళావతిని కోరడంతో సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించాలని ఆమె ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. ప్రభుత్వం నుంచి రూ.40 వేలు మంజూరు కావడంతో ఆ మొత్తాన్ని శనివారం మృతుని తల్లి చిన్నమ్మికి అందజేశారు. కార్యక్రమంలో బిటివాడ సర్పంచ్ శ్రీరామ నర్సింహులునాయుడు, మండల కో–ఆప్షన్ సభ్యుడు గోవిందరాజు పాల్గొన్నారు.



వీరఘట్టం: సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సమన్వయంతో ముందుకు సాగుదాం

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమన్వయంతో ముందుకు సాగుదామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. వండవ క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకర్లతో మాట్లాడారు. కొన్ని గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సావధానంగా పరిష్కరించుకుందామన్నారు. ఆది నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తున్న గ్రామస్థాయి నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. టీడీపీ–జనసేన పొత్తులను నియోజకవర్గ ప్రజలు వచ్చే ఎన్నికల్లో చిత్తుచేస్తారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాందిపలుకుతాయన్నారు. పేదల తరఫున పోరాడుతున్న వైఎస్సార్‌సీపీకి, పెత్తందారుల తరఫున ఉన్న టీడీపీకీ మధ్య ఈ ఎన్నికలు జరగనున్నాయన్నారు. అంతిమ విజయం వైఎస్సార్‌సీపీదేనని అన్నారు.



ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

కుశిమి సంతలో మెడికల్ క్యాంప్

సీతంపేట: మండలంలోని కుశిమి వారపు సంతలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. పాలకొండ, సీతంపేట ఏరియా ఆస్పత్రి వైద్యులు, కుశిమి పీహెచ్‌సీ, విజయ ఆస్పత్రి వైద్య సిబ్బంది శిబిరంలో సేవలందించారు. ఈ సందర్భంగా వృద్ధులకు దుప్పట్లు, గొడుగులు, యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఎంపీడీఓ గీతాంజలి, పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై జగదీశ్‌నాయుడు తదితరులు శిబిరాన్ని సందర్శించి వైద్య సేవలను పర్యవేక్షించారు.



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ, తదితరులు

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళిక

సీతంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అన్నదొర తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులను పరీక్షలకు సంసిద్ధత చేశామన్నారు. విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రస్తుతం పాఠ్యాంశాల రివిజన్ జరుగుతోందన్నారు. వచ్చేనెల 18 నుంచి జరగనున్న పబ్లిక్ పరీక్షలకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో 29 ఆశ్రమ పాఠశాలల నుంచి 484 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

సృజనాత్మకతను వెలికితీయాలి

పాలకొండ రూరల్: విద్యార్థులు తమలో దాగిఉన్న సృజనాత్మకను వెలికితీయాలని డిప్యూటీ డీఈఓ పి. కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని రవీంద్రభారతి విద్యా సంస్థల్లో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను తిలకించి, ప్రాజెక్టు పనితీరు, ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సైన్స్‌పై ఆసక్తి పెంచేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.సోంబాబు, పాఠశాల చైర్మన్ ఎంఎస్.మణి, జోనల్, డివిజన్ ఇన్‌చార్జులు ఎన్.వెంకటేష్, చుక్కా శ్రీనివాసరావు, టి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆసక్తిగా తిలకిస్తున్న డిప్యూటీ డీఈఓ, ఎంఈఓ, తదితరులు

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

జియ్యమ్మవలస: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రావాడ రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చీకటి శంకరరావు సూచించారు. మండలంలోని అప్పన్నదొరవలస గ్రామంలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా పాటించాలని, అలాంటప్పుడే అందరం ఆరోగ్యంగా ఉండగలుగుతామన్నారు. ఎవరు ఎటువంటి అనారోగ్య సమస్యలతో బాధపడినా వెంటనే ఆస్పత్రిని సంప్రదించాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల ఎత్తు, బరువు చూసి, పిల్లలకు ప్రతి రోజూ పౌష్టికాహారం పెట్టాలన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శంకరరావు

షిర్డీసాయికి క్షీరాభిషేకం



సింగిడిలో సాయిబాబా విగ్రహాలకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

భామిని: మాఘ పౌర్ణమి సందర్భంగా మండలంలోని సింగిడి, బత్తిలి, కాట్రగడ–బి, బాలేరు, సొలికిరి గ్రామాల్లోని షిర్డీసాయి మందిరాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము నుంచే ఆలయాలకు చేరుకుని సాయిబాబాకు క్షీరాభిషేకాలు చేశారు. సత్యసాయి కమిటీలు, సమరసత సేవా సంఘాల ఆధ్వర్యంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని వంశధార నదికి హారతులు పట్టారు. భక్తులు దీపాలు పట్టుకుని ఊరేగింపుగా నదికి వెళ్లి గంగమ్మకు హారతులు ఇచ్చారు.

రిమాండ్ ఖైదీల పట్ల శ్రద్ధ అవసరం



రిమాండ్ ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి

- న్యాయమూర్తి విజయరాజ్‌కుమార్

పాలకొండ రూరల్: రిమాండ్ ఖైదీల వ్యక్తిగత భద్రత, ఆరోగ్య రక్షణ, వారికి అందిస్తున్న ఆహారం విషయంలో జైలు సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. స్థానిక సబ్‌జైల్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. జైలు రికార్డులు తనిఖీ చేశారు. జైలు పరిశరాల, వంట గది నిర్వహణను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వివిధ కేసుల్లో చిక్కుని జైల్లో ఉన్న రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. మోనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా, వసతులు ఎలా ఉన్నాయని అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ బి.జోగులు, హెడ్ వార్డర్స్ పి.చంద్రరావు, విజయ్‌కుమార్, వార్డర్లు మధు, నాగరాజు, న్యాయవాదులు రఘు, నాయుడు, కోర్టు సిబ్బంది కిరణ్మయి తదితరులున్నారు.

సకాలంలో వైద్యసేవలు అందించాలి

గరుగుబిల్లి: సకాలంలో దీర్ఘకాలిక రోగులకు వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు తెలిపారు. మండలంలోని ఎస్.ఆర్.పేటలో శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, అక్కడ అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అక్కడికి వచ్చిన గర్భిణులు, రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే వారికి అందిస్తున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే వైద్యం అందేలా ప్రభుత్వం గ్రామాల్లో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అమలు చేస్తోందని, ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వైద్యసేవలపై ఆరాతీస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి

కొమరాడ: రానున్న వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులంతా వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి, నివేదికలు చదివి, వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు తమ ప్రాంతాల పరిధిలోని పలు ప్రజాసమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ శ్యామల మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేసి, మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, చాలా గిరిజన గ్రామాలకు బీటీ రోడ్ల నిర్మాణాలు బాగా జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు నంగిరెడ్డి శరత్‌బాబు, కేంద్రక అన్నపూర్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ప్రతీ పౌరుడు అంబేడ్కర్ వంటి మహనీయుడు జీవిత చరిత్రను తెలుసుకోవాలని, ఆయన ఆశయ సాధన దిశగా జీవనం సాగించాలని వక్తలు కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, సర్పంచ్ మండంగి కళావతి, ఎంపీటీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు